సాక్షి సూర్యాపేట

శుక్రవారం, 13, అక్టోబర్, 2023



గంజాయి పట్టివేత

రూ.31లక్షల విలువైన గంజాయిని రామాపురం చెక్‌పోస్టు వద్ద పోలీసులు పట్టుకున్నారు. - 10లో



సేవలు మరువలేనివి

ఎంఎస్ స్వామినాథన్ చేసిన సేవలు మరువలేనివని ఏఐకేఎస్ జాతీయ నేత సారంపల్లి మల్లారెడ్డి అన్నారు. - 12లో



పవిత్రోత్సవాలు ప్రారంభం

మట్టపల్లి క్షేత్రంలో గురువారం రాత్రి పవిత్రోత్సవాలను అత్యంత వైభవంగా ప్రారంభించారు. - 12లో

న్యూస్‌రీల్

ఇన్‌చార్జ్ ఎస్పీగా నాగేశ్వర్‌రావు బాధ్యతల స్వీకరణ



సూర్యాపేట క్రైం: అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావు జిల్లా ఇన్‌చార్జ్ ఎస్పీగా గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఎస్పీ రాజేంద్రప్రసాద్ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు బదిలీ కాగా అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావుకు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన విషయం విదితమే.

డీఎంహెచ్‌ఓగా కోటాచలం

సూర్యాపేట: జిల్లా వైద్యాధికారిగా డాక్టర్ కోటాచలం గురువారం బాధ్యతలు స్వీకరించారు. జూన్‌లో సెలవుపై విదేశాలకు వెళ్లి తిరిగి వచ్చి విధుల్లో చేరేందుకు రాగా ఉన్నతాధికారులు నిరాకరించారు. ఆయన తిరిగి సెలవులో ఉంటూనే హైకోర్టును ఆశ్రయించారు. బుధవారం కోటాచలంను జిల్లా వైద్యాధికారిగా విధుల్లో చేర్చుకోవాలని హైకోర్టు వైద్యారోగ్య శాఖ సంచాలకుడు శ్రీనివాస్‌కు ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు ఆయన ఉత్తర్వులు జారీ చేయడంతో బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓగా పనిచేసిన డాక్టర్ హర్షవర్దన్ డిప్యూటీ డీఎంహెచ్‌ఓగా కొనసాగనున్నారు.

14న వాలీబాల్ జట్ల ఎంపిక పోటీలు

మునగాల: ఉమ్మడి నల్లగొండ జిల్లా పాఠశాలల వాలీబాల్ జట్ల ఎంపిక పోటీలు శనివారం సూర్యాపేట పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించనున్నట్లు స్కూల్ గేమ్స్‌ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) జిల్లా కార్యదర్శి ఎండీ.అజంబాబా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో సూర్యాపేట, యాదాద్రి భువనగిరి, నల్లగొండ జిల్లాలకు చెందిన పాఠశాలల అండర్- 14 , 17 విభాగాల విద్యార్థులు హాజరు కావొచ్చని సూచించారు. సంబంధిత జిల్లా కార్యదర్శులు వారి జిల్లాకు చెందిన జట్లను శనివారం ఉదయం 9గంటల లోపు ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానానికి తీసుకురావాలని కోరారు. ఈ పోటీల్లో పాల్గొనే విద్యార్థులు వయస్సు ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని పేర్కొన్నారు.

సోషల్ మీడియా విషయంలో జాగ్రత్తగా ఉండాలి



మాట్లాడుతున్న చైతన్య

హుజూర్‌నగర్ : సోషల్ మీడియా పట్ల విద్యార్థినులు జాగ్రత్తగా ఉండాలని మహిళా సాధికారత కేంద్రం జిల్లా మిషన్ కోఆర్డినేటర్ చైతన్య అన్నారు. గురువారం హుజూర్‌నగర్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సోషల్ మీడియాలో వచ్చే తెలియని లింకులను ఓపెన్ చేయవద్దని, ఫొటోలను డీపీలో పెట్టవద్దని అన్నారు. లింగ వివక్ష, లింగ సమానత్వం, బాల్య వివాహాలు, అక్రమ రవాణ, అక్రమ దత్తత, గర్భస్థ లింగనిర్ధారణ యాక్ట్, పోక్సో యాక్ట్, రుతుక్రమ పరిశుభ్రత, హెల్ప్‌లైన్ నెంబర్స్, సోషల్ మీడియా తదితర అంశాలపై అవగాహన కల్పించారు. పాఠశాల హెచ్‌ఎం. లతీఫ్, కె వినోద్, రేవతి, తేజస్విని, భవ్య, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

16న ప్రజావాణి రద్దు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : జిల్లాలో సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లా అధికారులు వారికి కేటాయించిన విధుల్లో పూర్తిగా నిమగ్నమై ఉన్నందున ఈనెల 16వ తేదీన నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ ఎస్. వెంకట్రావు తెలిపారు. ఈమేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

టీఆర్టీ శిక్షణ దరఖాస్తు గడువు పొడిగింపు

నల్లగొండ: టీఆర్టీ(టీచర్ రిక్రూట్‌మెంట్ టెస్ట్)కు ప్రిపేర్ అవుతున్న ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన అభ్యర్థులకు బీసీ స్టడీ సర్కిల్ నల్లగొండ ఆధ్వర్యంలో ఇచ్చే ఉచిత ఆన్‌లైన్ శిక్షణకు దరఖాస్తు గడువును ఈ నెల 18 వరకు పొడిగించినట్టు స్టడీ సర్కిల్ డైరెక్టర్ విజయ్ కుమార్ గురువారం తెలిపారు. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో స్టడీ సర్కిల్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఎంపికైనవారికి ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. పూర్తి వివరాలకు టీఎస్ బీసీ స్టడీ సర్కిల్, నల్లగొండ, లేదా 08682-220007 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

బడుల్లో బతుకమ్మ



దసరా సెలవులు రావడంతో గురువారం తుంగతుర్తిలోని డీఆర్ఆర్ఎం పాఠశాలలో ముందస్తుగా నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు, సిబ్బంది



తిరుమలగిరిలోని కృష్ణవేణి పాఠశాలలో బతుకమ్మలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

బిజీ.. బిజీ..

ఎన్నికల ఏర్పాట్లలో జిల్లా అధికారులు తలమునకలు

- రోజూ ప్రత్యేక సమావేశాలు.. సమీక్షలు
- ఏర్పాట్లు పరిశీలిస్తూ.. కోడ్‌ను అమలు చేస్తూ..
- ఎన్నికల విధుల్లో 12 వేల మందికి పైగా ఉద్యోగులు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : అసెంబ్లీ ఎన్నికల ఏర్పాట్లలో అధికారులు తలమునకలయ్యారు. కలెక్టరేట్‌లోని దాదాపు అన్ని శాఖల జిల్లా అధికారులకు, సిబ్బందికి ఎన్నికల విధులు కేటాయించారు. రోజూ కలెక్టరేట్‌లో ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లపై చర్చలు జరపడం, సమావేశాలు నిర్వహిస్తూ బిజీగా మారారు. కలెక్టర్ ఎస్. వెంకట్రావు ఎన్నికలకు సంబంధించి సమీక్షలు, సమావేశాలు, వీడియో కాన్ఫరెన్స్‌లు నిర్వహిస్తున్నారు.

ఇటు శాఖా పరమైన విధులు.. అటు ఎన్నికల పనులు

కలెక్టరేట్‌లో ఎన్నికల విభాగం ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా జిల్లా ఎన్నికల అధికారికి సహాయకులుగా మొత్తం ఎనిమిది మంది ఉన్నారు. వీరిలో ఎన్నికల సూపరింటెండెంట్, డిప్యూటీ తహసీల్దార్, ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లు కాగా మరో నలుగురు కంప్యూటర్ ఆపరేటర్లు ఉన్నారు. వీరంతా నెల రోజులుగా ఉదయం నుంచి రాత్రి వరకు ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. వీరే కాకుండా ఆయా శాఖల అధికారులు ఎన్నికల ఏర్పాట్లలో బిజీగా మారారు. జిల్లా స్థాయి అధికారులైతే ఇటు తమ శాఖకు సంబంధించిన పనులు చేస్తూ అటు ఎన్నికల ఏర్పాట్లపై తమకు



నోడల్ అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట్రావు, చిత్రంలో అదనపు కలెక్టర్లు

కేటాయించిన మండలాలు, గ్రామాలకు వెళ్లి క్షేత్ర పర్యటన చేస్తున్నారు. అక్కడ పోలింగ్ కేంద్రాల్లో ఉన్న సదుపాయాలు, ఇంకా కావాల్సిన అవసరాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు.

రిటర్నింగ్ అధికారుల కేటాయింపు

జిల్లాలో నాలుగు నియోజకవర్గాలకు రిటర్నింగ్ అధికారులను ఇప్పటికే కేటాయించారు. తుంగతుర్తి నియోజకవర్గానికి జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, హుజూర్‌నగర్ నియోజకవర్గానికి జగదీశ్వర్‌రెడ్డి, సూర్యాపేట నియోజకవర్గానికి సూర్యాపేట ఆర్‌డీఓ వీరబ్రహ్మచారి, కోదాడ నియోజకవర్గానికి కోదాడ ఆర్‌డీఓ సూర్యానారాయణలను రిటర్నింగ్ అధికారులుగా నియమించారు. అదే విధంగా నియోజకవర్గాల పరిధిలోని తహసీల్దార్లు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులుగా వ్యవహరించనున్నారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల నామినేషన్ దగ్గర నుంచి పోలింగ్, కౌంటింగ్ వరకు అన్ని బాధ్యతలను వీరు నిర్వర్తించనున్నారు. అదే విధంగా అభ్యర్థుల వ్యయ నిర్ధారణ, ఫిర్యాదులు, చర్యలు వంటివి రిటర్నింగ్ అధికారులు చూసుకుంటారు.

ఎన్నికల పర్యవేక్షణకు కమిటీలు..

జిల్లాలో ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు కలెక్టర్ ఎస్. వెంకట్రావు 17 కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ బృందాలకు జిల్లా అధికారులను నోడల్ అధికారులుగా విధులు కేటాయించారు. ఇందులో మోడల్ కోడ్ అమలు, ఈవీఎం, వీవీ ప్యాట్ల పర్యవేక్షణ, ఉద్యోగులకు విధుల కేటాయింపు, అభ్యర్థి తరఫున ఏజెంట్లకు లైసెన్స్ ఇవ్వడానికి, పోలింగ్ కేంద్రాల వద్ద మౌలిక వసతుల కల్పన, ఎన్నికల సిబ్బందికి శిక్షణ, ఓటరు నమోదుపై అవగాహన, ఎన్నికల వ్యయ నిర్ధారణ, మీడియా కమ్యూనికేషన్, పోస్టల్ బ్యాలెట్- ఈవీఎం బ్యాలెట్ కమిటీ, ఇన్ఫర్మేషన్ అండ్ టెక్నాలజీ, గెస్ట్ హౌస్‌ల ఏర్పాటు, మైక్రో అబ్జర్వర్, హెల్ప్‌లైన్ అండ్ కంట్రోల్ యూనిట్, ఎంసీఎంసీపీ, పోలీస్ కోఆర్డినేషన్, హెలిపాడ్ కోఆర్డినేషన్ వంటి వాటికి వివిధ శాఖల అధికారులతో కమిటీలను ఏర్పాటు చేశారు.

పోలింగ్ నిర్వహణకు సుమారు 12 వేల మంది

పోలింగ్ నిర్వహణకు సిబ్బందిని కేటాయించే పనిలో జిల్లా అధికారులు ఉన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులతో పాటు, ఇతర శాఖల ఉద్యోగులను పోలింగ్ నిర్వహణకు వినియోగించుకోనున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు సరిపడకపోతే ప్రైవేట్ ఉపాధ్యాయులను విధులకు వాడనున్నారు. జిల్లాలో 1,201 పోలింగ్ కేంద్రాలు ఉండగా ప్రతి పోలింగ్ కేంద్రానికి ఒక పోలింగ్ ఆఫీసర్, ఒక అసిస్టెంట్ పోలింగ్ అధికారి, ఇద్దరు, లేదా ముగ్గురు పోలింగ్ సిబ్బందిని కేటాయించనున్నారు. దీని ప్రకారం 1,201 మంది పోలింగ్ అధికారులు, 1,201 మంది అసిస్టెంట్ పోలింగ్ అధికారులు , ఇద్దరు సిబ్బందిని వాడితే 2,402 మంది, లేదా ముగ్గురిని కేటాయిస్తే 3,603 మంది ఎన్నికల సిబ్బందికి విధులు కేటాయించనున్నారు.

తుపాకీ వాపస్

లైసెన్స్‌డ్ గన్స్ పోలీస్ స్టేషన్లలో డిపాజిట్

- ఉమ్మడి జిల్లాలో లైసెన్స్‌డ్ గన్స్ కలిగిన వారు 455 మంది
- ఎన్నికల కోడ్ నేపథ్యంలో డిపాజిట్ చేయాలని ఆదేశం
- ఇప్పటికే కొందరు ఆయా పోలీస్ స్టేషన్లలో అప్పగింత



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో.. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా లైసెన్స్‌డ్ తుపాకులు (గన్స్) పొందిన వివిధ రాజకీయ పార్టీల నాయకులు, వ్యాపారస్తులు, ప్రముఖుల నుంచి పోలీస్ శాఖ ఆయుధాలను వెనక్కి తీసుకుంటోంది. ఈ మేరకు వారందరికి నోటీసులు జారీచేసింది. నోటీసు అందిన వారం రోజుల్లోగా తమ వద్ద ఉన్న తుపాకులను సంబంధిత పోలీస్ స్టేషన్లలో అందజేయాలని స్పష్టం చేసింది. దీంతో లైసెన్స్‌డ్ తుపాకులు కలిగిన వారంతా పోలీసు స్టేషన్ల బాటపట్టారు. ఉమ్మడి జిల్లాలో 455 మంది లైసెన్స్ తుపాకులు తీసుకున్న వారు ఉన్నారు. అందులో అత్యధికంగా రాజకీయ పార్టీలకు చెందిన నాయకులే. ఆ తరువాత బడా వ్యాపారులు ఉన్నారు. ఒక్క నల్లగొండ జిల్లాలో 227 మందికి లైసెన్స్‌డ్ గన్స్ ఉండగా, వారిలో దాదాపుగా ఇప్పటికే పోలీసు స్టేషన్లలో డిపాజిట్ చేశారు. సూర్యాపేట జిల్లాలో 154 మందికి లైసెన్స్‌డ్ గన్స్ ఉండగా, 110 మంది ఇప్పటికే తిరిగి అప్పగించారు. యాదాద్రి జిల్లాలో 74 మందికి లైసెన్స్‌డ్ గన్స్ ఉండగా, వారిలో కొంతమంది తిరిగి అప్పగించారు. మిగతా వారు అప్పగించేందుకు సిద్ధమయ్యారు. అలాంటి వారిలో ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, ఇతర నాయకులు ఉన్నారు.

తగ్గిన లైసెన్స్‌డ్ గన్‌లు

నల్లగొండ జిల్లాలో గన్ కల్చర్ కొంత మేర తగ్గింది. గతంలో భారీ సంఖ్యలో వ్యక్తిగత తుపాకులు కలిగిన వారు ఉండగా, ఇప్పుడు వారి సంఖ్య తగ్గుముఖం పట్టింది. ముఖ్యంగా నక్సల్స్ ప్రభావం ఎక్కువగా ఉన్న సమయంలో ప్రాణ భయంతో వ్యక్తిగత భద్రత కోసం గన్ లైసెన్స్‌లను ఎక్కువ మంది తీసుకున్నారు. ఒకప్పుడు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1500 వరకు వ్యక్తిగత ఆయుధాలను సమకూర్చుకోగా, ఇప్పుడు వారి సంఖ్య 455కు తగ్గిపోయింది. గత ఎన్నికల సమయంతో పోల్చితే సూర్యాపేట, యాదాద్రి జిల్లాలు మినహా నల్లగొండలో ఈ ఐదేళ్లలో గన్ లైసెన్స్ తీసుకున్నవారి సంఖ్య తగ్గింది. 2018 ఎన్నికల సమయంలో నల్లగొండలో 257 మంది లైసెన్స్‌డ్ గన్స్ కలిగిన వారు ఉండగా, ఇప్పుడు వారి సంఖ్య 227కు తగ్గింది.

దుర్వినియోగం చేయవద్దనే..

ఎన్నికల సమయంలో, సభలు, సమావేశాలు నిర్వహించినప్పుడు, ప్రతిపక్ష పార్టీలు తారసపడినప్పుడు వాటిని దుర్వినియోగం చేసే అవకాశాన్ని అడ్డుకునేందుకు ఎన్నికల సంఘం ఈ నిబంధన తీసుకువచ్చింది. అంతేకాకుండా ఎన్నికల సమయంలో ఎవరూ వ్యక్తిగతంగా భయభ్రాంతులకు గురిచేయకుండా ఉండేందుకు తమ వద్ద ఉన్న గన్‌లను పోలీసు స్టేషన్లలో అప్పగించేలా నిబంధన విధించింది.

వీటికి మినహాయింపు

ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం కోడ్ అమల్లో ఉన్న సమయంలో గన్స్ పోలీసు స్టేషన్లలో డిపాజిట్ చేయడంలో కొన్ని విభాగాలను మినహాయించారు. ముఖ్యంగా బ్యాంకుల సెక్యూరిటీ, టోల్ ప్లాజాలు, క్రీడలకు సంబంధించిన ఈవెంట్స్‌లో ఉన్న వాటిని డిపాజిట్ చేయడం నుంచి మినహాయించారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి

భానుపురి (సూర్యాపేట) :తమ సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డికి గురువారం వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా శాఖ అధ్యక్షుడు ఎన్. సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ రిటైర్డ్ ఉద్యోగులకు పీఆర్సీ నియమించడం, ఈ హెచ్ ఎస్ సౌకర్యం పై జీఓ విడుదల చేయడం హర్షణీయమన్నారు. ఐ ఆర్ ఐదు శాతం మాత్రమే ఇవ్వడం కొంత బాధగా ఉందని, బకాయి పడ్డ మూడు డీ ఏ లను వెంటనే విడుదల చేసి కమ్యూటేషన్ 15 సంవత్సరాలకు బదులు 12 సంవత్సరాలకు తగ్గించాలన్నారు. 398 స్పెషల్ టీచర్లకు నేషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి రాంబాబు, దండ శ్యాంసుందర్ రెడ్డి, రవీందర్ రెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి పాల్గొన్నారు.



మంత్రి జగదీష్ రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న నేతలు

నేటి నుంచి జోనల్ లెవల్ స్పోర్ట్స్ మీట్

భువనగిరి: పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల మైదానంలో 2023-24కు సంబంధించి శుక్రవారం నుంచి జరగనున్న 9వ జోనల్ లెవల్ స్పోర్ట్స్ మీట్‌లో పాల్గొనేందుకు క్రీడాకారులు గురువారం భువనగిరికి చేరుకున్నారు. జనగాం, సూర్యాపేట, నల్లగొండ, భువనగిరి జిల్లాల్లోని 13 పాఠశాలలు, కళాశాలలకు చెందిన 1,105 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొనున్నారు. తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల రీజినల్ కోఆర్డినేటర్ రజిని, ప్రిన్సిపాల్ శ్రీరాం శ్రీనివాస్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



విద్యార్థుల గౌరవ వందనం స్వీకరిస్తున్న గురుకుల పాఠశాలల రీజినల్ కో ఆర్డినేటర్

ప్రజాస్వామ్యంలో మీడియా పాత్ర కీలకం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట్రావు, చిత్రంలో అదనపు కలెక్టర్ ప్రియాంక తదితరులు

- ఎన్నికల నియమావళి తప్పక పాటించాలి
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకట్రావు
- కలెక్టరేట్‌లో మీడియా సెంటర్ ప్రారంభం



కలెక్టరేట్‌లో మీడియా సెంటర్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : ప్రజాస్వామ్యంలో మీడియా పాత్ర చాలా కీలకమని కలెక్టర్ ఎస్. వెంకట్రావు అన్నారు. జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల నిర్వహణలో భాగంగా కలెక్టరేట్‌లో మీడియా సెంటర్, ఎంసీఎంసీ కేంద్రాన్ని గురువారం అదనపు కలెక్టర్ సీహెచ్ ప్రియాంకతో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. దేశపాలన, పౌరులకు సేవలు అందించడంలో మీడియా ఫోర్త్ ఎస్టేట్‌గా నిలుస్తుందన్నారు. ఎన్నికల సమాచారాన్ని ఎప్పటికప్పుడు మీడియా సెంటర్ ద్వారా అందజేస్తామన్నారు. ఈ కేంద్రం ద్వారా పెయిడ్ న్యూస్, ఫిర్యాదులు వాటి సమస్యలు, దిన పత్రికల్లో వచ్చే వార్తలు, ఎలక్ట్రానిక్, కేబుల్ ప్రకటనలు పరిశీలిస్తామన్నారు. మీడియా సెంటర్‌లో సిబ్బందిని నియమించడంతో పాటు మౌలిక వసతులు కల్పించామన్నారు. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలకు సంబంధించిన ఎన్నికల సమాచారాన్ని అందుబాటులో ఉంచుతామని మీడియా ప్రతినిధులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మీడియాకు కూడా మోడల్ కోడ్ వర్తిస్తుందని, సోషల్ మీడియా పోస్టుల విషయంలో జాగ్రత్త వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీపీఆర్‌ఓ ఎ. రమేష్‌కుమార్, డీఈఐఈ మల్లేశం, సీపీఓ వెంకటేశ్వర్లు, సంక్షేమ అధికారిణి జ్యోతి పద్మ, ఏఓ సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలపై అవగాహన ఉండాలి

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : శాసనసభ సాధారణ ఎన్నికల ఏర్పాట్లకు సంబంధించిన అంశాలపై ఆయా నోడల్ అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ వెంకట్రావు సూచించారు. గురువార కలెక్టరేట్‌లో నోడల్ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల విధులు ఎంతో కీలకమైనవని, ఎక్కడా ఏ చిన్న పొరపాటు జరగకుండా అన్ని జాగ్రత్తలతో సమర్థంగా నిర్వర్తించాలన్నారు. ఎన్నికల సంబంధ పనులు ఎన్నికల సంఘం సూచించిన మార్గదర్శకాల మేరకు పూర్తి చేయాలన్నారు. ఈవీఎంల నిర్వహణ, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు పకడ్బందీగా చేయాలన్నారు. ఎన్నికల సామగ్రి ముందస్తుగా సమకూర్చుకోవాలన్నారు. ఎన్నికల సిబ్బందిని గుర్తించి, శిక్షణ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఫిర్యాదుల విభాగం క్రియాశీలకంగా పనిచేయాలన్నారు. ఎపిక్ కార్డుల ముద్రణ త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు సీహెచ్. ప్రియాంక, ఎ. వెంకట్‌రెడ్డి , నోడల్ అధికారులు పాల్గొన్నారు.

29, 30 తేదీల్లో ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలు

నేరేడుచర్ల : హైదరాబాద్‌లో ఈనెల 29, 30 తేదీలలో ఏఐవైఎఫ్ రాష్ట్ర రెండవ మహాసభలు నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను తెలిపారు. గురువారం నేరేడుచర్లలో ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ సభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, నగేష్, రాజేష్, మధు, శ్రీలత తదితరులు ఉన్నారు.


ఇంటింటా చదువుల పంట

- విద్యార్థుల్లో సామర్థ్యాల పెంపే లక్ష్యంగా ప్రత్యేక కార్యక్రమం
- యాప్‌లో పేర్లు నమోదు
- వర్క్‌షీట్లతో వారానికో కృత్యం
- అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

నాగారం : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో కనీస అభ్యసన సామర్థ్యాలను పెంపొందించడంపై విద్యాశాఖ దృష్టి సారించింది. ప్రాథమిక స్థాయిలో తొలిమెట్టు, ఉన్నత పాఠశాలల్లో 6 నుంచి 9 తరగతుల విద్యార్థులకు ఉన్నతి కార్యక్రమాలను అమలు చేస్తోంది. పదో తరగతి విద్యార్థుల ఉత్తీర్ణతను పెంచేందుకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తోంది. విద్యార్థులు ఇంటి వద్ద పాఠ్యాంశాలను సాధన చేసేందుకు సాంకేతికతను వినియోగించుకొని ప్రతిభను చాటేలా అధికారులు చొరవ చూపుతున్నారు. 3-10 తరగతుల విద్యార్థుల కోసం 'ఇంటింటా చదువుల పంట' పేరుతో విద్యార్థులు ఇంటి వద్ద సాధన చేసేందుకు ప్రత్యేక అభ్యాసాలను రూపొందించారు. గతేడాది మంచి ఫలితాలు రావడంతో ఈ ఏడాది కూడా పథకాన్ని కొనసాగించేందుకు చర్యలు చేపట్టారు. తద్వారా జిల్లాలో 3 నుంచి 10వ తరగతి చదువుతున్న 63,508 మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరనుంది.

విద్యార్థుల నమోదుపై దృష్టి..

విద్యార్థుల వాట్సాప్ నంబర్లను తరగతుల వారీగా ఉపాధ్యాయులు ప్రత్యేక రిజిష్టర్లలో నమోదు చేస్తున్నారు. గతంలో ఒక ఫోన్ నంబరు ఒకే విద్యార్థికి ఉండాలన్న నిబంధన ఉండగా ప్రస్తుతం ఎక్కువ మందికి అవకాశం కల్పించారు. ఒకే ఇంట్లో ఇద్దరు, ముగ్గురు పిల్లలు ఉన్నా ఒకే నంబర్‌తో ఉపయోగించేందుకు అనుమతి ఇచ్చారు. పాఠశాల యూడైస్ కోడ్ ఆధారంగా తరగతుల వారీగా ఇంటింటా చదువుల పంట యాప్‌లో పేర్లు నమోదు చేయిస్తున్నారు. ప్రతి శనివారం సెల్‌ఫోన్‌కి లింక్ ద్వారా వాట్సాప్‌లో వర్క్ షీట్లను పంపిస్తున్నారు. వాటిని మళ్లీ శుక్రవారంలోగా పూర్తి చేసేలా ఉపాధ్యాయులు పర్యవేక్షణ చేయాలి. ప్రతి విద్యార్థి ఇంటి వద్ద వర్క్‌షీట్లను సాధన చేసేలా ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయల సమావేశం(పీటీఎం)లో ఈ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. విద్యార్థులు వర్క్‌షీట్లను సాధన చేసి వాట్సాప్‌లో మళ్లీ ఉపాధ్యాయులకు పంపిస్తే వారు సరిచేసి విద్యార్థులకు సలహాలు, సూచనలు అందజేస్తారని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. ఈ కార్యక్రమాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు.



ప్రాథమిక పాఠశాలలు	680
ప్రాథమికోన్నత పాఠశాలలు	78
ఉన్నత పాఠశాలలు	182
మోడల్‌స్కూల్స్	09
విద్యార్థుల సంఖ్య	63,508

ఇంటి వద్ద పాఠ్యాంశాలను సాధన చేసేలా..



"ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో కనీస అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు ఇంటింటా చదువుల పంట హోమ్ లెర్నింగ్ ప్రోగ్రామ్‌ను ప్రభుత్వం చేపట్టింది. 3 నుంచి 10వ తరగతి విద్యార్థులు సాంకేతికతను వినియోగించుకొని ఇంటి వద్ద పాఠ్యాంశాలను సాధన చేసి ప్రతిభ చాటేందుకు ఎంతో ఉపయోగపడుతుంది. వీడియోల రూపంలో ప్రశ్నలు, సమాధానాలు ఉండటంతో విద్యార్థులకు సులభంగా అర్థమవుతుంది. ఉపాధ్యాయులు వాట్సాప్ ద్వారా ప్రతి వారం పంపుతున్న వర్క్‌షీట్లను విద్యార్థులు సాధన చేయడం ద్వారా పాఠ్యాంశాలపై పూర్తి స్థాయిలో పట్టు సాధించవచ్చు.

– దేవరశెట్టి జనార్దన్, సెక్టోరియల్ అధికారి, సూర్యాపేట



మొట్టమొదటి ప్రధాని నెహ్రూతో కాశీరాం (ఫైల్)

మూడు నియోజకవర్గాలకు ప్రాతినిధ్యం

రామన్నపేట: ఎంపీగా, ఎమ్మెల్యేగా మూడు నియోజకవర్గాలకు ప్రాతినిధ్యం వహించి ప్రజల మన్ననలు పొందారు వడ్డెపల్లి కాశీరాం. నల్లగొండ లోక్‌సభ స్థానానికి 1960లో జరిగిన ఉప ఎన్నికల్లో వడ్డెపల్లి కాశీరాం కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి విజయం సాధించి రెండేళ్ల పాటు పార్లమెంట్ సభ్యుడిగా పనిచేశారు. అనంతరం 1962 ఎన్నికల్లో మిర్యాలగూడ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో నిలిచి విజయం సాధించారు. అనంతరం 1967, 1972లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో రామన్నపేట నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా విజయం సాధించి మూడు వేర్వేరు నియోజకవర్గాలకు ఎంపీగా, ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించిన నాయకుడిగా ఉమ్మడి నల్లగొండ చరిత్రలో నిలిచిపోయారు.

బీఆర్‌ఎస్ ఎన్నికల ప్రచార ఇన్‌చార్జ్‌ల నియామకం

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: బీఆర్‌ఎస్ ఇక పూర్తిస్థాయిలో ప్రచార పర్వంలోకి దిగబోతోంది. ఇందుకోసం నియోజకవర్గాల వారీగా ఎలక్షన్ క్యాంపెయిన్ ఇన్‌చార్జ్‌లను నియమించింది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ముందుగా ఐదు నియోజకవర్గాలకు ఇన్‌చార్జ్‌లను నియమించింది. వారందరికీ గురువారం బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు టెలీ కాన్ఫరెన్స్ ద్వారా దిశానిర్దేశం చేశారు. ఎనికల ప్రచారంలో అనుసరించాల్సిన వ్యూహాలను సూచించారు. ఇకపై నియోజకవర్గాల్లో నిర్వహించనున్న ప్రచార కార్యక్రమాలు.. ప్రస్తుతం నియమించిన ఎలక్షన్ క్యాంపెయిన్ ఇన్‌చార్జ్‌ల ఆధ్వర్యంలో జరగనున్నాయి. ఈ నెల 13వ తేదీ నుంచి ఎన్నికలు ఫలితాలు వెలువడే వరకు ఆయా నియోజకవర్గాల సంపూర్ణ బాధ్యతను వారే తీసుకొని పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుంటూ ప్రచార బాధ్యతలను నిర్వహించాల్సి ఉంటుంది.

క్యాంపెయిన్ ఇన్‌చార్జ్‌లుగా నియమితులైన వారు వీరే..

నాగార్జునసాగర్	ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, రామచంద్రనాయక్
హుజూర్‌నగర్	విజయసింహారెడ్డి
కోదాడ	ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు
నల్లగొండ	జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి
నకిరేకల్	రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్

ఓటరు నమోదుకు 31 వరకు అవకాశం

- అవగాహన కల్పిస్తున్న అధికారులు

భువనగిరిటౌన్: తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలకు నగారా మోగడంతో కేంద్ర ఎన్నికల సంఘం అర్హులైన వారు ఓటరుగా నమోదు చేసుకునేందుకు మరో అవకాశం కల్పించింది. ఓటరు నమోదుకు గత నెల 19వ తేదీ వరకు గడువు ఉండగా, ఈ నెల 4వ తేదీన ఓటర్ల తుది జాబితా విడుదల చేశారు. ఇంకా ఓటరుగా నమోదు చేసుకోని వారెవరైనా ఉంటారనే ఆలోచనతో ఈ నెల 31వ తేదీ వరకు కొత్తగా ఓటరు నమోదుకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు అధికారులు వెల్లడించారు. అక్టోబర్ 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన వారే కాకుండా ఇప్పటివరకు ఓటు హక్కు లేని వారు దరఖాస్తు చేసుకోవచ్చు. అర్హులైన వారు తప్పనిసరిగా ఓటరుగా నమోదు కోవాలని అధికారులు ప్రచారం చేస్తున్నారు.

ఇలా తెలుసుకోవచ్చు

ప్రజలు తమకు ఓటు హక్కు ఉందా లేదా అనే వివరాలను తెలుసుకునేందుకు వివిధ రకాల వెబ్‌సైట్లు అందుబాటులో ఉన్నాయి. కేంద్ర ఎన్నికల సంఘానికి చెందిన వెబ్‌సైట్ www.nvsp.in, voters.eci.gov.inతో పాటు రాష్ట్రానికి సంబంధించి www.ceotelangana.nic.in వెబ్‌సైట్ చూసుకోవచ్చు. అంతేకాకుండా ఓటరు హెల్ప్‌లైన్ మొబైల్ యాప్ ద్వారా కూడా ఓటు ఉందో లేదో తెలుసుకోవచ్చు. 1950 నంబర్‌కు ఫోన్ చేసినా ఓటు హక్కు సంబంధించిన సమాచారం ఇస్తారు. కాగా ఓటు లేని వారు ఫారం–6 ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అదేవిధంగా చిరునామా మార్పునకు ఫారం–8 ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉండగా.. పూర్తిగా పేరు తొలగింపునకు మాత్రం ఇప్పుడు అవకాశం లేదని అధికారులు స్పష్టం చేశారు.



ఓటరు నమోదుపై అవగాహన కల్పిస్తున్న యాదాద్రి జిల్లా నోడల్ అధికారి భట్టు నాగిరెడ్డి

అవగాహన కల్పిస్తున్నాం


అక్టోబర్ 31వ తేదీ వరకు ఓటరుగా నమోదు చేసుకోవాలని ప్రజలతో పాటు జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఇంజనీరింగ్, ఇతర వృత్తివిద్యా కోర్సుల కళాశాలలో అవగాహన కల్పిస్తున్నాం.కొత్తగా ఓటు హక్కు వచ్చిన వారికి ఎలా ఓటు వేయాలని అని వీవీ ప్యాట్‌లతో అవగాహన కల్పిస్తున్నాం.

– భట్టు నాగిరెడ్డి, భువనగిరి జిల్లా నోడల్ అధికారి

చైతన్య ఖిలా.. భువనగిరి

- రాచరికం నుంచి ప్రగతి పథాన పయనం
- నియోజకవర్గంలో మూడొంతులు హెచ్‌ఎండీఏ పరిధిలోనే..
- రాష్ట్ర, జాతీయ రాజకీయాల్లో చక్రం తిప్పిన ఇక్కడి నేతలు





భువనగిరి పట్టణ వ్యూ

అసెంబ్లీ ఫ్లాష్‌బ్యాక్

సాక్షి, యాదాద్రి : నాటి రాచరికం నుంచి నేటి ప్రజాస్వామ్య వ్యవస్థ వరకు భువనగిరికి ఎంతో విశిష్టత ఉంది. ఆంధ్ర మహాసభ, తొలిదశ తెలంగాణ ఉద్యమం భువనగిరి కేంద్రంగా ప్రారంభమయ్యాయి. కాలానుగుణంగా సామాజిక, రాజకీయ, ఆర్థిక రంగాల్లో అనేక మార్పులతో ప్రగతి వైపు పయనిస్తోంది. హైదరాబాద్ నగరానికి అతి చేరువలో ఉన్న భువనగిరి అసెంబ్లీ నియోజకవర్గం మూడొంతులు హెచ్‌ఎండీఏ పరిధిలో ఉంది. జిల్లాల పునర్విభజనలో జిల్లా కేంద్రంగా మారింది. భువనగిరిలో ఇప్పటి వరకు 17 సార్లు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పీడీఎఫ్ రెండు సార్లు, సీపీఐ ఒకసారి, కాంగ్రెస్, కాంగ్రెస్‌ఐలు కలిపి ఐదు సార్లు, టీడీపీ ఏడు సార్లు, టీఆర్‌ఎస్ (ప్రస్తుతం బీఆర్‌ఎస్) రెండుసార్లు విజయం సాధించాయి. భువనగిరి నేతలు జాతీయ, రాష్ట్రస్థాయి రాజకీయాల్లో చక్రం తిప్పారు.

నియోజకవర్గం భౌగోళిక చరిత్ర..

భువనగిరి నియోజకవర్గంలో భూదాన్‌పోచంపల్లి, భువనగిరి, బీబీనగర్, వలిగొండతో పాటు కొత్తగా ఏర్పాటవుతున్న మత్స్యాద్రి వేములకొండ అడ్డగూడూరు మండలం ఉన్నాయి. నియోజకవర్గంలో ప్రస్తుతం 257 పోలింగ్ కేంద్రాల్లో 2,11,362 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 1,05,404 మంది పురుషులు, 1,05,968 మంది మహిళా ఓటర్లు ప్రస్తుతం ఉన్నారు. ఈ నియోజకవర్గం సెమీ అర్బన్‌గా ఉంది. హెచ్‌ఎండీఏ పరిధిలో భువనగిరి పట్టణం, మండలం, బీబీనగర్, పోచంపల్లి మండలాలు చేరాయి. నియోకవర్గంలో ప్రధాన వృత్తి వ్యవసాయం. అన్ని మండలాలకు మూసీ జలాలు అందుతాయి. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన పోచంపల్లి టై అండ్ డై చీరల తయారీ, భువనగిరి, బీబీనగర్‌లో పారిశ్రామిక వాడల ఏర్పాటుతో ఎందరికో ఉపాధి కలుగుతోంది. ప్రఖ్యాతి గాంచిన పోచంపల్లి పట్టు చీరలు పుట్టింది ఇక్కడే. ఆచార్య వినోభాబావే భూదా నోద్యమం ప్రారంభించింది పోచంపల్లిలోనే. ఈ నియోజకవర్గం మీదుగా హైదరాబాద్–భూపాలపట్నం జాతీయ రహదారి 163 ఉంది. సంగారెడ్డి– భువనగిరి– చౌటుప్పల్ మీదుగా రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణం కాబోతుంది. దాని వెంట రీజినల్ రైల్ లైన్ మంజూరైంది. ఓఆర్‌ఆర్ నుంచి కొత్తగూడెం వరకు నూతన జాతీయ రహదారి పనులు కొనసాగుతున్నాయి. సికింద్రాబాద్–కాజీపేట, బీబీనగర్– నడికుడి రైలు మార్గాలున్నాయి. బీబీనగర్‌లో ఎయిమ్స్ వైద్య సేవలు అందిస్తోంది. సీసీఎంబీ వంటి ప్రతిష్టాత్మక సంస్థలు మంజూరు కానున్నాయి.



రావి నారాయణరెడ్డి, కొండా లక్ష్మణ్ బాపూజీ, కొమ్మిడి నర్సింహారెడ్డి, ఎలిమినేటి మాధవరెడ్డి, ఎలిమినేటి ఉమామాధవరెడ్డి, పైళ్ల శేఖర్‌రెడ్డి

పార్లమెంట్ భవనాన్ని ప్రారంభించిన 'రావి'

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ఆంధ్ర మహాసభకు అధ్యక్షుడిగా పోరుబాట నడిపారు రావి నారాయణరెడ్డి. 1952లో జరిగిన తొలి సాధారణ ఎన్నికల్లో భువనగిరి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా, నల్లగొండ ఎంపీగా పోటీ చేసిన రావినారాయణరెడ్డి రెండు చోట్లా విజయం సాధించారు. ఎంపీగా అప్పటి భారత ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ కంటే ఎక్కువ ఓట్ల మెజార్టీ వచ్చింది. దీంతో పార్లమెంట్ భవనాన్ని రావి నారాయణరెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం భువనగిరి ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు.

ఇప్పటి వరకు భువనగిరి ఎమ్మెల్యేలు వీరే..

సంవత్సరం	గెలిచినవారు	పార్టీ	సమీప ప్రత్యర్థి	పార్టీ
1952	రావి నారాయణరెడ్డి	పీడీఎఫ్	వి.రెడ్డి	కాంగ్రెస్
1952 (ఉ.ఎ.)	జి. రామలింగం	కాంగ్రెస్	జీఎం. షరీఫ్	పీడీఎఫ్
1957	రావి నారాయణరెడ్డి	పీడీఎఫ్	వీఆర్. రెడ్డి	కాంగ్రెస్
1962	ఆరుట్ల రామచంద్రారెడ్డి	సీపీఐ	టీఎల్. రెడ్డి	కాంగ్రెస్
1967	కొండా లక్ష్మణ్ బాపూజీ	కాంగ్రెస్	ఎ. రామచంద్రారెడ్డి	సీపీఐ
1972	కొండా లక్ష్మణ్ బాపూజీ	కాంగ్రెస్	కె. రామచంద్రారెడ్డి	సీపీఎం
1978	కె. నర్సింహారెడ్డి	కాంగ్రెస్(ఐ)	కొండా లక్ష్మణ్ బాపూజీ	జనతా పార్టీ
1983	కె. నర్సింహారెడ్డి	కాంగ్రెస్	ఎం. భిక్షపతి	ఇండిపెండెంట్
1985	ఎలిమినేటి మాధవరెడ్డి	టీడీపీ	వి. నరేంద్రరెడ్డి	కాంగ్రెస్
1989	ఎలిమినేటి మాధవరెడ్డి	టీడీపీ	గర్దాసు బాలయ్య	కాంగ్రెస్
1994	ఎలిమినేటి మాధవరెడ్డి	టీడీపీ	మాడుగుల నర్సారెడ్డి	కాంగ్రెస్
1999	ఎలిమినేటి మాధవరెడ్డి	టీడీపీ	అందెల లింగంయాదవ్	కాంగ్రెస్
2000 (ఉ.ఎ.)	ఎ. ఉమామాధవరెడ్డి	టీడీపీ	వెంకటేశ్వరెడ్డి	కాంగ్రెస్
2004	ఎ. ఉమామాధవరెడ్డి	టీడీపీ	నరేంద్ర	టీఆర్‌ఎస్
2009	ఎ. ఉమామాధవరెడ్డి	టీడీపీ	జిట్టా బాలకృష్ణారెడ్డి	ఇండిపెండెంట్
2014	పైళ్ల శేఖర్‌రెడ్డి	టీఆర్‌ఎస్	జిట్టా బాలకృష్ణారెడ్డి	ఇండిపెండెంట్
2018	పైళ్ల శేఖర్‌రెడ్డి	టీఆర్‌ఎస్	కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి	కాంగ్రెస్

భువనగిరి నుంచి గెలిచి మంత్రులయ్యారు..

భువనగిరి నియోజవర్గంలో ఎమ్మెల్యేలుగా గెలిచిన ముగ్గురు మంత్రులయ్యారు. వారిలో ఇద్దరు భార్యాభర్తలు ఉన్నారు. ఎలిమినేటి మాధవరెడ్డి వరుసగా నాలుగుసార్లు గెలుపొంది ఎన్టీఆర్ ప్రభుత్వంలో హోంమంత్రి, ఆరోగ్య శాఖ మంత్రిగా.. చంద్రబాబు మంత్రివర్గంలో హోంమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా పనిచేశారు. ఆయన సతీమణి ఉమామాధవరెడ్డి ఎమ్మెల్యేగా గెలిచి చంద్రబాబు మంత్రివర్గంలో భుగర్భ వనరుల శాఖ మంత్రి అయ్యారు. కొండా లక్ష్మణ్ బాపూజీ ఇక్కడి నుంచి గెలిచి కాసు బ్రహ్మానందరెడ్డి, దామోదరం సంజీవయ్య మంత్రి వర్గాల్లో పనిచేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం జరిగిన తొలిదశ ఉద్యమంలో తన మంత్రి పదవికి రాజీనామా చేశారు.

భారీగా నగదు పట్టివేత

నల్లగొండ క్రైం: ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో జిల్లా వ్యాప్తంగా పోలీసులు వాహనాల తనిఖీలు ముమ్మరం చేశారు. ఈ తనిఖీల్లో భాగంగా గురువారం మునుగోడులో రూ.22.04లక్షలు, నార్కట్‌పల్లిలో రూ.7.30లక్షలు, మిర్యాలగూడలో రూ.91.41లక్షలు, కనగల్‌లో రూ.30లక్షలు పట్టుబడినట్లు నల్లగొండ ఎస్పీ అపూర్వరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

రామన్నపేటలో రూ.10లక్షల నగదు స్వాధీనం..

రామన్నపేట: మండల కేంద్రంలోని భువనగిరి రోడ్డులో గురువారం సాయంత్రం పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా జనార్దన్‌రెడ్డి అనే వ్యక్తి ఇన్నోవా కారులో ఆధారాలు లేకుండా తీసుకెళ్తున్న రూ.1.05లక్షల నగదును సీజ్ చేశారు. నకిరేకల్‌లో వ్యవసాయ కూలీలకు చెల్లించడానికి నగదును తీసుకెళ్తున్నట్లు వాహనదారుడు పోలీసులకు చెప్పినట్లు సమాచారం. అదేవిధంగా నకిరేకల్‌లో నివాసముంటున్న సత్యలక్ష్మి వలిగొండ మండలం చిత్తాపురం గ్రామంలో పొలం అమ్మగా వచ్చిన రూ.9 క్షల నగదును తన కుమారులతో కలిసి తీసుకెళ్తుండగా రామన్నపేటలో పోలీసులు పట్టుకున్నారు. తన ఆపరేషన్‌తో పాటు మనువడి వైద్యం కోసం చేసిన అప్పులను తీర్చడానికి భూమి అమ్మి డబ్బులు తీసుకెళ్తున్నట్లు బాధిత మహిళ కన్నీటి పర్యంతమయ్యింది. పట్టుబడిన నగదును ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అప్పగించనున్నట్లు ఎస్ఐ ఎం. లక్ష్మయ్య తెలిపారు.

నకిరేకల్‌లో రూ.6.36లక్షలు..

నకిరేకల్: మండలంలోని కడపర్తి గ్రామ శివారులో సిరాంఛ హైవేపై గురువారం సాయంత్రం వాహనాల తనిఖీల్లో భాగంగా పోలీసులు ఆంధ్రప్రదేశ్‌లోని అనకాపల్లి నుంచి వరంగల్‌కు వెళ్తున్న కారులో రూ.6.36లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. కారులో ఉన్న వారిని విచారిస్తే ట్రాన్స్‌పోర్టుకు సంబంధించిన నగదు అని తెలిపారని సీఐ రాజశేఖర్ తెలిపారు.

49 మంది బైండోవర్..

భువనగిరి క్రైం: ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో యాదాద్రి జిల్లాలో తనిఖీలు ముమ్మరం చేసినట్లు డీసీపీ రాజేష్‌చంద్ర గురువారం తెలిపారు. తనిఖీల్లో ఇప్పటివరకు 74.19 లీటర్ల మద్యంతో పాటు రూ.8,41,150 నగదును స్వాధీనం చేసుకుని, 49 మందిని బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు.



రామన్నపేట: వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు



ఎంపీ కారు తనిఖీ

నల్లగొండ క్రైం : భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వాహనాన్ని నల్లగొండ పట్టణంలో పోలీసులు తనిఖీ చేశారు. ఎంపీ గురువారం ఉదయం హైదరాబాద్ నుంచి నల్లగొండకు వస్తుండగా మర్రిగూడ బైపాస్ వద్ద పోలీసులు ఆపి తనిఖీ చేశారు. తనిఖీల్లో పోలీసులకు ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పూర్తిగా సహకరించారు.

ప్రజా ఆశీర్వాద సభకు ఏర్పాట్లు ముమ్మరం



భువనగిరి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఈ నెల 16న జరగనున్న ప్రజా ఆశీర్వాద సభ కోసం ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ సభకు సీఎం కేసీఆర్ వస్తుండడంతో పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, యాదాద్రి భువనగిరి

గంజాయి తరలిస్తున్న యువకుల అరెస్ట్

మోతె: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు యువకులను మోతె మండలంలోని మామిళ్లగూడెం టోల్ ప్లాజా వద్ద గురువారం పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా తిర్మలాయపాలెం మండలం కాకరవాయి గ్రామానికి చెందిన గూడూరు సతీష్, తిర్మలాయపాలెం మండలం పిండిప్రోలు గ్రామానికి చెందిన గోకనపల్లి మధు బైక్‌పై గంజాయి తరలిస్తుండగా మోతె మండలంలోని మామిళ్లగూడెం టోల్ ప్లాజా వద్ద పోలీసుల వాహనాలు తనిఖీ చేస్తుండగా పట్టుబడ్డారు. వీరి వద్ద ఉన్న బ్యాగును తనిఖీ చేయగా ఒక కేజీ 700గ్రాముల గంజాయి లభించింది. పట్టుబడిన గంజాయిని భద్రాచలం, చింతూర్ పరిసర ప్రాంతాల్లో కొనుగోలు చేసి ఖమ్మం జిల్లాలోని తిర్మలాయపాలెం, కూసుమంచి, మోతె మండలాల్లో విక్రయిస్తున్నట్లు నిందితులు తెలిపారు. పట్టుబడిన గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకొని ఇద్దరిని అరెస్టు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు మోతె ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

బేకరీ ఉత్పత్తుల తయారీతో స్వయం ఉపాధి

గరిడేపల్లి : చిరుధాన్యాలతో బేకరీ ఉత్పత్తుల తయారీలతో మహిళలు స్వయం ఉపాధి పొందవచ్చని నారమ్ ప్రిన్సిపల్, సైంటిస్ట్, షెడ్యూల్డ్ కులాల ఉపప్రణాళిక చైర్మన్ డాక్టర్ బాలకృష్ణన్ అన్నారు. గురువారం మండలంలోని గడ్డిపల్లిలో గల కృషి విజ్ఞాన కేంద్రంలో నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్ (నారమ్) హైదరాబాద్ వారి సహకారంతో షెడ్యూల్డ్ కులాల ఉప ప్రణాళికలో భాగంగా షెడ్యూల్డ్ కులాలకు చెందిన మహిళలకు చిరుధాన్యాలతో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై నిర్వహిస్తున్న 6రోజుల శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో గృహ విజ్ఞాన శాస్త్రవేత్త సుగంధి, కేవీకే ఇన్‌చార్జ్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ బి.లవకుమార్, కేవీకే శాస్త్రవేత్త కిరణ్, నరేష్, మాధురి తదితరులు పాల్గొన్నారు.



మహిళలకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న బాలకృష్ణన్

చికిత్స పొందుతూ మృతి

వలిగొండ: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వలిగొండ మండలంలోని సాయిరెడ్డిగూడేనికి చెందిన గూడూరు యాదిరెడ్డి (68) బుధవారం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ గఫార్ తెలిపారు.

విద్యుదాఘాతంతో మృతి



మచ్చ కృష్ణ (ఫైల్)

నేరేడుచర్ల: విద్యుదాఘాతంతో వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన గురువారం నేరేడుచర్ల మండలంలోని పత్తేపురంలో చోటుచేసుకుంది. నేరేడుచర్ల ఎస్ఐ పచ్చిపాల పరమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. పత్తేపురం గ్రామానికి చెందిన మచ్చ కృష్ణ(38) గ్రామంలో ప్రైవేట్ విద్యుత్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. గురువారం గ్రామ శివారులో గల 11కేవీ విద్యుత్ స్తంభం ఎక్కి బంపర్ కలుపుతుండగా ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని తాపీ మేస్త్రీ మృతి

చివ్వెంల(సూర్యాపేట): గుర్తుతెలియని వాహనం ఢీకొని తాపీ మేస్త్రీ మృతిచెందాడు. ఈ ఘటన చివ్వెంల మండలంలోని వల్లభాపురం ఆవాసం జగన్నాయక్‌తండా వద్ద 65వ నంబర్ జాతీయ రహదారిపై బుధవారం అర్ధరాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చివ్వెంల మండల పరిధిలోని వట్టిఖమ్మంపహాడ్ గ్రామానికి చెందిన గోగుల సుధాకర్(38) తాపీ మేస్త్రీగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. సుధాకర్ బుధవారం జగన్నాయక్‌తండా వద్ద తాపీ పనిచేసి రాత్రి ఇంటికి తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో తండా వద్ద జాతీయ రహదారి దాటుతుండగా విజయవాడ నుంచి హైదరాబాద్ వైపునకు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సుధాకర్ తలకు తీవ్ర గాయాలై అక్కడిక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విష్ణుమూర్తి తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూర్యాపేట జనరల్ హాస్పిటల్‌కు తరలించి, పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు పేర్కొన్నారు.

బండరాళ్లు మీదపడి వ్యక్తి మృతి

కొండమల్లేపల్లి: స్టోన్ క్రషర్ క్వారీలో బండకు రంధ్రాలు పెడుతుండగా ప్రమాదవశాత్తు బండరాళ్లు మీదపడి వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన కొండమల్లేపల్లి మండలం కొల్‌ముంతలపహాడ్ గ్రామ పంచాయతీ పరిధిలోని బాపూజీనగర్‌లో గురువారం చోటుచేసుకుంది. వివరాలు.. బాపూజీనగర్‌కు చెందిన అలకుంట చినరాయుడు(30) తమ గ్రామ పరిధిలోని స్టోన్ క్రషర్ క్వారీలో పనిచేస్తున్నాడు. గురువారం ఉదయం క్వారీలో బండకు రంధ్రాలు పెడుతుండగా ప్రమాదవశాత్తు బండరాళ్లు మీదపడడంతో తలకు తీవ్ర గాయాలై మృతిచెందాడు. కాగా ఈ ఘటనపై తమకెలాంటి ఫిర్యాదు అందలేదని కొండమల్లేపల్లి ఎస్ఐ వీరబాబు తెలిపారు.

బండరాయితో తండ్రిపై కుమారుడి దాడి

- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి
- పెద్దవూరు మండలం పోతునూరు గ్రామంలో ఘటన



వెంకటయ్య (ఫైల్)

పెద్దవూర: కుమారుడు మద్యం మత్తులోబండరాయితో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడిన తండ్రి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటన బుధవారం రాత్రి పెద్దవూర మండలంలోని పోతునూరు గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పోతునూరు గ్రామానికి చెందిన బొడ్డు వెంకటయ్య(55)కు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. పెద్ద కుమారుడు బొడ్డు రాజబాబు లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. రాజబాబుకు మండలంలోని తెప్పలమడుగు గ్రామానికి చెందిన యువతితో వివాహం జరిగింది. భార్యాభర్తల మధ్య గొడవల కారణంగా రాజబాబు భార్య తన పిల్లలతో కలిసి గత ఐదు సంవత్సరాల నుంచి తెప్పలమడుగులోని ఆమె తల్లిగారింటి వద్దే ఉంటుంది. రాజబాబు మాత్రం పోతునూరులోనే తన తల్లిదండ్రుల వద్ద ఉంటూ లారీ డ్రైవర్‌గా, గ్రామంలో మేస్త్రీ పనులకు వెళ్తూ వచ్చిన డబ్బులతో మద్యం తాగుతూ తల్లిదండ్రులతో తరచూ గొడవ పడుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. బుధవారం రాత్రి కూడా మద్యం తాగి ఇంటికి వచ్చిన రాజబాబు తన తండ్రి వెంకటయ్యతో గొడవపడ్డాడు. ఈ క్రమంలో బండరాయితో వెంకటయ్య తలపై బలంగా కొట్టాడు. అంతటితో ఆగకుండా వెంకటయ్యను పైకి లేపి సిమెంట్ రోడ్డుపై రెండుసార్లు ఎత్తి పడేశాడు. దీంతో తీవ్రంగా గాయపడిన వెంకటయ్య స్పృహ తప్పి పడిపోయాడు. చుట్టుపక్కల వారు వచ్చి పోలీసులకు, 108 వాహనానికి సమాచారం అందించటంతో చికిత్స నిమిత్తం వెంకటయ్యను నాగార్జునసాగర్‌లోని కమలానెహ్రూ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య వెంకటమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అజ్మీరా రమేష్ తెలిపారు.

రూ.31లక్షల విలువైన గంజాయి పట్టివేత

- ఒడిశా నుంచి ముంబైకి తరలిస్తుండగా కోదాడలో స్వాధీనం
- ఇద్దరు నిందితుల అరెస్ట్
- వివరాలు వెల్లడించిన సూర్యాపేట జిల్లా ఇన్‌చార్జి ఎస్పీ నాగేశ్వర్‌రావు



వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌చార్జి ఎస్పీ నాగేశ్వర్‌రావు

సూర్యాపేట క్రైం: కారులో తరలిస్తున్న రూ.31లక్షల విలువైన గంజాయిని కోదాడ మండలంలోని రామాపురం వద్ద ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టు వద్ద బుధవారం పోలీసులు పట్టుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను గురువారం సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఇన్‌చార్జి ఎస్పీ నాగేశ్వర్‌రావు వెల్లడించారు. ఇన్‌చార్జి ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని ముంబైకి చెందిన ఆసిఫ్‌ఖాన్ వృత్తిరీత్యా డ్రైవర్. అదే ప్రాంతానికి చెందిన మహమ్మద్ ఇమ్రాన్ చేపల వ్యాపారం చేస్తున్నాడు. వీరిద్దరూ చిన్నప్పటి నుంచి స్నేహితులు. వారు సంపాదించే డబ్బులు సరిపోకపోవడంతో తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలని అనుకున్నారు. ముంబైలో కొందరు గంజాయి విక్రయిస్తూ బాగా సంపాదించడం చూసిన ఆసిఫ్‌ఖాన్ తాను కూడా అదే బాటలో నడవాలని భావించి స్నేహితుడైన మహమ్మద్ ఇమ్రాన్‌కు విషయం తెలపగా.. అతడూ ఒప్పుకున్నాడు. దీంతో ఈ నెల 5వ తేదీన ఆసిఫ్‌ఖాన్ కారు(ఎంహెచ్ 02 జేపీ 2474)లో వారిద్దరు ముంబై నుంచి బయల్దేరి 7వ తేదీన ఒడిశా రాష్ట్రంలోని తప్తపని అనే ప్రాంతానికి వెళ్లారు. అక్కడ గుర్తుతెలియని వ్యక్తి నుంచి కిలో గంజాయి రూ.1000 చొప్పున 125.1కిలోలు (61 ప్యాకెట్లు) కొనుగోలు చేసి కారు డిక్కీ, వెనుక సీటుకింద కనబడకుండా పెట్టి 8వ తేదీన సాయంత్రం ఒరిస్సా నుంచి ముంబైకి బయల్దేరారు. మార్గమధ్యలో పోలీసుల కంటపడకుండా అక్కడక్కడ కారు ఆపుతూ వస్తున్నారు. 11వ తేదీన సూర్యాపేట జిల్లా కోదాడ మండలం రామాపురం వద్ద ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టు వద్ద కోదాడ పోలీసులు వీరి కారును ఆపే ప్రయత్నం చేయగా.. తప్పించుకునే ఉద్దేశంతో అతివేగంగా కారును నడిపి ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టారు. కారు ముందుభాగం దెబ్బతినగా పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని కారును పరిశీలించారు. కారు డిక్కీలో, వెనుక సీటు కిందిభాగంలో గంజాయిని పోలీసులు గుర్తించారు. కోదాడ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ సమక్షంలో గంజాయితో పాటు కారు, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని నిందితులను గురువారం రిమాండ్ చేసినట్లు ఇన్‌చార్జి ఎస్పీ నాగేశ్వర్‌రావు తెలిపారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.31లక్షలు ఉంటుందని పేర్కొన్నారు. నిందితులను పట్టుకోవడంలో సహకరించిన కోదాడ డీఎస్పీ బి. ప్రకాష్, కోదాడ రూరల్ సీఐ రామకృష్ణారెడ్డి, ఎస్ఐలు సాయిప్రశాంత్, ఇబ్రహీం, లింగారెడ్డి, సిబ్బంది ఏ. వెంకన్న, కె. వెంకటేశ్వర్లు, ఏ. వెంకయ్య, కె. సైదులు, ఎం. ప్రేమజ్యోతి, కె. తిరుపతిరెడ్డి, ఎ. మధు, ఎస్‌కె. జాన్‌పాషాను ఆయన అభినందించారు.

సాక్షి క్లాసిఫైడ్స్



■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం జీతం: 18K. Ph: 9640400073/9848571888 [H-189342]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచు రించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.